
# మహానగరం కథలు

## -వేదుల సుభద్ర





*మహానగరం కథలు*

**ఢిల్లీ, బొంబాయి, బెంగుళూర్, హైదరాబాదు, లండన్, పారిస్, న్యూయార్క్. పేరేదైనా, స్వదేశమైనా, విదేశమైనా.** ఉన్నది ఎక్కడైనా, తీరు, తెన్నూ ఒకటే.. ఆకాశాన్నంటే మేడలూ. ఇబ్బుడి ముబ్బిడిగా పెరుగుతున్న వాహనాలూ, జనాభా, మారుతున్న ప్రజలూ, తరుగుతున్న వనరులూ మానవతా విలువలూ, రోజురోజుకీ చేరుతున్న ఊహకందని మార్పులూ, ఎటువైపో తెలియని జీవన పయనాలు.వెరసి. గజిబిజి బ్రతుకుల ఉరుకుల పరుగులతో .. మహానగరాలన్నీ "యమహా" నగరాలవుతున్నాయి.

కాలుష్యమూ, యాంత్రికీకరణా, మెటీరియలిజమూ, స్వార్థమూ, మనుష్యులమధ్య పెరుగుతున్న దూరాలూ, ఆర్థికసంబంధాలే జీవిత సంబంధాలనుకునే రోజులూ ... ఇవేనా నగరాలలోకనిపించేది? ఇంతకు మించి మరేమీ లేదా? కాదు.. తరచి చూస్తే ఆవేశాలూ, ఆనందాలూ, పురోగమనాలూ, బాంధవ్యాలూ, పోటీ తత్వాలూ, గెలుపిచ్చే సంతోషాలు. పంచుకుంటే పెరిగే సుఖాలూ మాట విరుచుకుంటే మిగలని సంబంధాలూ, వెతలే కాదు.. కతలూ కనిపిస్తాయి..

అత్యంత సంపన్నులూ, అతి నిరుపేదలూ కలిసి ఆకాశమనే ఇంటికప్పుకింద కలిసి చేసే సహజీవనాలే మహానగరాలు. ఓపికుండి వింటే సాలభంజికలని మించి చెప్పే కథా సాగరాలు. నిత్యం మారుతున్న మన రోజువారీ జీవన చిత్రాలు.. ఈ మహానగరం కథలు..!!

# మెక్సికో అమ్మ

**'కాట్ యూ'!** కిల కిల నవ్వుతూ పరిగెడుతూ జారి పడబోతున్న నా చిన్న కూతురు శ్యామని పట్టుకుని ఆపి, తెల్లని పలువరస తళుక్కుమనేలా నవ్వుతున్నాడతను.

"శ్యామా! " అంటూ పరుగున వెళ్ళి మూడేళ్ళ పాపని అతని చేతుల్లోంచి అందుకుంది అపర్ణ, నా భార్య..

సాయంత్రపు మసక వెలుతురులో తెల్లగా, మిల మిల మెరుస్తూ హుందాగా నిలబడి ఉంది కార్నివల్ క్రూజ్. కేలిఫోర్నియా రాష్ట్రం లోని లాంగ్ బీచ్ అనే ఊరునించి మెక్సికో వెళ్లవలసిన కార్నివల్ వారి క్రూజ్. దాదాపు రెండేళ్ళ తర్వాత వచ్చిన అమ్మని తీసుకుని, క్రూజ్ మీద ఐదురోజుల విహారయాత్ర కోసంవచ్చాం నేను, అపర్ణా, పిల్లలు.

అంతా కొత్తగా ఉండడంతో కళ్ళు విప్పార్చుకుని చూస్తున్నారు శైలి, శ్యామ.

" రండి, రండి" అంటూ నవ్వుతూ ఆహ్వానించారు క్రూజ్ స్టాఫ్ నవ్వుతూ. అందరికన్నా చివరిగా నిలుచున్నాడతను.

తెల్లగా పొడవుగా అందంగా ఉన్నాడు. కొద్దిగా ఫిలిప్పీన్ దేశస్థుల పోలిక కనిపిస్తున్నా ఎక్కువగా యూరోపియన్ లా ఉన్నాడు. అమ్మ చేతిని పట్టుకుని నేను, శైలి చెయ్యి పట్టుకుని అమ్మా నడిచాము లోపలకి. మా వెనకే అపర్ణ, శ్యామ.

"మీరు పాపని చూసుకోండి, అమ్మని నేను చూసుకుంటాను" అంటూ వచ్చాడు. జాగ్రత్తగా అమ్మ చెయ్యి పట్టుకుని లోపలకి తీసుకొచ్చాడు.

" థాంక్ యూ" అని అమ్మ అంటే నవ్వాడు.

" ఈ అబ్బాయి నవ్వెంత బావుందిరా?, అచ్చు చందమామలా ఉన్నాడు" నా మనసులో మాట అమ్మ అనేసింది.

ఏదో అర్థమయినట్టు తను మళ్ళీ నవ్వేసి.

" వస్తాను సర్, అమ్మా వస్తాను, ఏదైనా కావాలంటే నాకు చెప్పండి" అంటూ వెళ్ళాడు.

మా గదుల్లో సామాన్లు సర్దుకుని సెటిల్ అయ్యాము. రాత్రి భోజనానికి అమ్మ అరటిపళ్ళు, పాలు తీసుకుంటానంది .

" అక్కడ వాళ్ళేం చేస్తారో, ఎలా చేస్తారో తెలీదు కదరా! వద్దులే!" అంది.

"శాఖాహారులకి ప్రత్యేకంగా వండుతారమ్మా, నేను ముందే చెప్పి ఉంచాను కదా. రా, చూద్దాం,మధ్య రాత్రి ఆకలి వేస్తుందేమో!" అన్నాను.

మా పోరు పడలేక నడిచింది.

మేము డైనింగ్ టేబిల్ దగ్గరకి వెళ్లేసరికి అక్కడంతా కోలాహలంగా ఉంది. వెయిటర్స్ అందరూ ఎవరికి కావలసినవి వారికి తెచ్చివ్వడంలో బిజీగా ఉన్నారు. బఫే భోజనం ఉన్నా సరే వాళ్ళందరికీ బోల్డంత పని. మేము వెళ్ళి ఒక టేబిల్ ఖాళీగా ఉన్నదాన్ని చూసుకుని కూర్చున్నాం. రెండు వారాలకు ముందే నేను మాకు శాఖాహార భోజనం కావాలని చెప్పి ఉంచాను కనక అది తప్పకుండా ఉంటుందనే ధీమాగా ఉన్నాము.

మా వివరాలు కనుక్కున్న తర్వాత కూడా పదిహేను నిమిషాలవుతున్నా సరే మా భోజనం రాలేదు, వెళ్ళి మళ్ళీ గుర్తు చేసి వచ్చాను, అయినా జాడ లేదు. పిల్లలకి నిద్ర, ఆకలి సమానంగా వేస్తూ ఉండడంతో చిరాకు మొదలయింది.చిన్నది ఏడవడం మొదలు పెట్టింది.

ఇంతలో వచ్చాడు ఇందాకటి కుర్రాడు. వెనకే మాకు కావలసిన పదార్థాల ప్లేట్లతో.

“క్షమించాలి సార్. ఇందాకటినించీ మీకు కలిగిన అసౌకర్యాన్ని గమనించాను. వెరీ వెరీ సారీ. ఇదిగోండి. మీరడిగినవి.  పాపలూ ముందు మీకు, అమ్మా! తర్వాత మీకూ" అంటూ గబ గబా ఇచ్చాడు.

“ఇందాకా చెప్పలేదు కదా, నా పేరు అర్విన్! ఇది నా ఫోన్ నంబర్. మీకు ఎప్పుడు ఏం కావలన్నా వెంటనే నాకో ఫోన్ చెయ్యండి. పిల్లలు, అమ్మ గారు ఇబ్బంది పడకూడదు” అంటూ తన ఫోన్ నంబర్ కూడా ఇచ్చాడు. నాకు ఆశ్చర్యం వేసింది అతని ప్రవర్తనకి.

" అమ్మా, మీకింకేమైనా కావాలా?” అంటూ అమ్మని ఒకటికి రెండు సార్లు అడిగాడు.

పిల్లలు, అమ్మా పడుకున్నాకా డెక్ మీదకి వచ్చాము అపర్ణా, నేను. చాలా మంది పడుకున్నట్టున్నారు. చలిగా ఉండడం వల్ల డెక్ మీద కూడా జనం చాలా తక్కువ మంది ఉండడంతో అంతా ప్రశాంతంగా ఉంది.

దూరంగా రెయిలింగ్ దగ్గరగా కుర్చీ వేసుకుని కూర్చుని వెన్నెల రాత్రిలో సముద్రాన్ని చూస్తున్నాడు అర్విన్. చేతిలోని గ్లాస్ లోని డ్రింక్ ని మెల్లి మెల్లిగా తాగుతున్నాడు. మెత్తని అతని జుట్టు సముద్రం మీంచి వస్తున్న చల్లగాలికి ఎగురుతోంది.

పిల్లలు అమ్మ దగ్గర పడుకోవడంతో నేను. అపర్ణా చాలా సేపు అక్కడే కూర్చుని చాలా విషయాల గురించి మాట్లాడుకుంటూ ఉండిపోయాము.

మధ్య మధ్యలో అతన్నే చూస్తున్నాను నేను

" ఏం సార్, ఇంకా పడుకోలేదా?”  కొద్దిగా యాసగా ఉన్న ఇంగ్లీష్ లో పలకరించాడు అతను తిరిగి షిప్ వైపుకి నడుస్తూ మా దగ్గర ఆగి.

“లేదు. ఎంజాయ్ చేస్తున్నాం” అన్నాను నేను చిన్నగా నవ్వుతూ..

"ఓ కే సార్. అమ్మగారు పడుకున్నారా? ఆవిడకంతా బాగుంది కదా, సీ సిక్ నెస్ అదీ ఏమీ లేదు కదా, ఒక వేళ ఉంటే నాకు చెప్పండి. ఆవిడకేంకావాలన్నా వెంటనే చెప్పండి, వస్తానుగుడ్ నైట్” అంటూ వెళ్ళిపోయాడు.

నవ్వుతూ. తళుక్కున మెరిసిన పలువరస. అతని నవ్వు చాలా ప్రత్యేకంగా ఉంది. ముఖమంతా పరుచుకున్న వెలుగుతో కూడిన నవ్వు.

అతని నవ్వులో కృత్రిమత లేకపోయినా ఏదో దాపరికమున్నట్టుగా అనిపించేది. ‘క్రూజ్ దిగిపోయేలోగా కనుక్కోవాలి!’ అనుకున్నాను.

“అతనివిషయం నీకెందుకు?” అంటున్న మనసుని “ ఎంతో ఆత్మీయంగా ఉన్నాడు, అందుకే” అని చెప్పుకుని సమాధానపరిచి మరీ నిశ్చయించుకున్నాను.

మూడు రాత్రుల సముద్రయానానికి అపర్ణ కూడా నీరసపడింది. పిల్లలు బానే ఉన్నారు, ఆడుకుంటూ, ఈతలు కొట్టుకుంటూ, కావలసినంత కోక్ తాగుతూ టీ.వీ చూస్తూ ఎంజాయ్ చేస్తున్నారు. “మళ్ళీ ఎప్పుడు వస్తున్నాం?” అంటూ ఇంకా దిగకుండానే అడుగుతున్నారు.

ఆ రోజు నేనొక్కడినే కూర్చున్నాను.

“ఏం సార్, మేడం రాలేదా ఈరోజు? ఒక్కరే కూర్చున్నారు!” అంటూ వచ్చాడు.

క్రూజ్ లలో సర్వీస్ కి ఫిలిప్పీన్స్ వారికి ప్రత్యేకమైన పేరు.ఇతనిదీ బహుశా అలాంటి స్వభావమేనేమో అనుకుంటూ.

"అవును, అలిసిపోయింది. సముద్ర ప్రయాణం, పిల్లలని ఆడించడం లాంటివాటితో" అన్నాను..

" అదే అనుకున్నాను" అన్నాడు.

" కూర్చోండి" అన్నాను పక్కన కుర్చీ చూపిస్తూ..

కాస్త మొహమాటపడుతూ కూర్చున్నాడు.

" మీ గురించి చెప్పండి. ఎన్నాళ్ళనించీ పనిచేస్తున్నారు ఈ క్రూజ్ లో?" అన్నాను సంభాషణ మొదలుపెడుతున్నట్లు.

మెత్తగా నవ్వాడు.

" గుర్తు లేదు సార్, నాకు నాకు గుర్తున్నప్పటినించీ అంటే గ్రాడ్యుయేట్ అయినప్పటినించీ ఇదే ఉద్యోగం. సముద్రం మీద పడి టైం మర్చిపోయానేమో! పదేళ్ళయిందేమో, లేదా పన్నెండో?" అన్నాడు చిరునవ్వుతో.

“ఎందుకు ఎంచుకున్నారీ రంగం? మీకు సర్వీస్ అంటే ఇష్టమా?” అన్నాను.

" ఇది సర్వీస్ కాదు సార్, జీతాలు, టిప్ లు రావడం లేదూ?, పైగా ఉచితంగా భోజనాలు, తాగితే లిక్కర్, చీప్ లిక్కరే అనుకోండి!.” అన్నాడు నవ్వుతూ.

“సర్వీస్ అంటే ప్రతిఫలాపేక్ష లేకుండా చేసేది కదా! ఇది సర్వీస్ కాదు, కమర్షియల్ సర్వీస్ అనచ్చు" అన్నాడు. మళ్ళీ తనే.

ఒక్క క్షణం ఆలోచించాను అతని మాటలకి.

" కాదంటారా సార్?" అన్నాడు

" నిజమే కావచ్చు, కానీ అందరికీ ఉండదు కదా అలాంటి దృక్పథం!" అన్నాను.

" కావచ్చు సార్, మీరంటేనే కాని నాకిది తోచలేదు కూడా. నేను నా ఉద్యోగం చేస్తున్నాననే అనుకుంటాను, మీలాంటి వారు ప్రత్యేకంగా చెప్పేవరకూ.”

" అంటే చాలా మంది చెప్పారన్నమాట" అన్నాను..

మళ్ళీ అలాగే మెత్తని నవ్వు..

మీ నవ్వు చాలా బావుంటుంది.మా అమ్మ కూడా వచ్చినప్పటినించీ ఇదే మాట అంటోంది.

"చక్కటి కుర్రాడురా! చందమామలా నవ్వుతున్నాడు, నన్నెంత ప్రత్యేకంగా చూసుకుంటున్నాడో, ఏ తల్లి కన్న బిడ్డో" అంటోంది అన్నాను..

" నాకు కూడా తెలిస్తే బావుండును" అని తనలో తను అనుకున్నట్టుగా మెల్లగా అన్నాడు. " ఆవిడ మాత్రం ఎంత హుందాగా, ఆప్యాయంగా ఉన్నారు కదా! నాకెందుకో పెద్దవాళ్ళని చూస్తే ఎంతో ఆదరం, గౌరవం. మీ అమ్మగారు మరీ నచ్చారు నాకు" అన్నాడు ఒక్క బిగిన.

“అదేం అలా అన్నారు? మీ తల్లి తండ్రులు?” అన్నాను. “సారీ పర్సనల్ విషయాలు అడిగుతున్నానుకోండి.మీకిష్టమైతేనే చెప్పండి.”

“ నాకు తెలిసి మా నాన్నగారు తన వృత్తి రీత్యా ఊర్లు తిరుగుతూ ఉండేవారుట. షిప్పుల్లో పనిట, పాసెంజర్ షిప్స్ కాదనుకోండి. అలా తిరగడంలో ఆయనకి పరిచయమయి పెళ్ళి చేసుకున్న ముగ్గురు నలుగురిలో మా అమ్మ ఒకరు..” అతని గొంతులో ధ్వనిస్తున్న రవ్వంత బాధ.

“నాకు ఊహ తెలిసేసరికే ఆవిడ లేదు, కనీసం ఎప్పుడు పోయిందో, ఎలా పోయిందో? కూడా నాకు చెప్పినవాళ్ళు కూడా లేరు. నాకు గుర్తు తెలిసేసరికి నేను ఫిలిప్పీన్స్ రాజధాని మనీల లో ఒక మూల ఉన్న అనాధాశ్రమంలో పెరిగాను.

ఎప్పుడో ఒకసారి, అంటే ఏడాదికొకసారో, రెండుసార్లో వచ్చే ఒక వ్యక్తి మా నాన్న అని తెలిసింది. ఆయన ఎక్కడివాడో కూడా తెలీదు. తెల్లగా, ఎత్తుగా, అందంగా ఉండేవాడు. పెద్దగా ముద్దు అని కాదు కానీ ప్రేమగా మాట్లాడేవాడు. అతను వచ్చినప్పుడు నాకో రెండు, మూడు జతల బట్టలు, కొద్దిగా చాక్ లెట్లు తెచ్చేవాడు,

‘ ఈ సారి టైం లేదు అర్విన్, వచ్చేసారి కొంచెం టైం ఉంటుంది. అప్పుడు బయటకి డిన్నర్ కి వెళదాం' అనో లేదా టైం ఉంటే ఒకసారి బయటకి భోజనానికి తీసుకెళ్ళడమో చేసేవాడు.

అంతకు మించి అతనిగురించి ఎక్కువగా ఏమీ తెలీదు, అడిగినా పెద్దగా వివరాలు చెప్పేవాడు కాదు, అడగాలని నాకు తోచలేదు..

ఫలానాది చెయ్యాలని కానీ, చదువుకోవాలని కానీ ఎవరూ చెప్పలేదు. నాకు తోచినది చదువుకున్నాను, గ్రాడ్యుయేట్ ని అయ్యాను. ఆ తర్వాత ఏం చెయ్యాలి? చేతిలో కనీసపు డబ్బు లేని రోజుల్లో కనిపించిన ప్రకటన వల్ల ఇక్కడ సముద్రంలో తేలాను." అన్నాడు

"అరే! అలాగా? ఐ యాం సారీ!" అన్నాను

" సారీ ఎందుకు సార్! చిన్నప్పుడే అన్నీ చూడడం మంచిదే!! కనీసం తర్వాత జీవితా న్ని ఎలా మలుచుకోవాలో తెలుస్తుంది" అన్నాడు నవ్వుతూ.

'కష్టమైన జీవితం నవ్వడం నేర్పిస్తుందా? ఇష్టపడడం నేర్పిస్తుందా?' అనుకున్నాను..

'నా పిల్లలకి చిటికెన వేలి గోటికి కూడా కష్టం తగలకూడదని తపిస్తానే? అలాంటిది అర్విన్ లాంటి పిల్లలెంత మంది ప్రపంచమంతా?' అనుకుంటేనే నా కెందుకో మనసంతా కలచివేసినట్టయింది.

"నిజం సార్, నా అదృష్టం కొద్దీ మంచి ఆశ్రమంలో పెరిగాను, దానివల్ల ఎంతో మంచి జరిగింది. అలాంటి కనీస వసతి లేక పెడదారిన పడినవారు, జీవితంలో ఓడిపోయి కనుమరుగైనవారు కానీ ఎంతమంది ఉన్నారో? ఆలోచించండి!" అన్నాడు.

ఆలోచనలో పడ్డాను.

"నిజమే, మంచీ చెడ్డా నేర్పడానికి అమ్మా, నాన్న లేకపోవడం జీవితంలో పెద్ద వెలితే!". అన్నాను.

" నాన్ననైనా కనీసం ముఖం చూశాను కానీ నేను చూడనిది, కావాలనుకునేది అమ్మని" అన్నాను కొద్దిగా ఇమోషనల్ గా.

తనని పట్టించుకోని తండ్రి మీద కోపం వల్ల ఇలా అంటున్నాడని నాకర్ధం అయింది. "మీ నాన్నగారు మిమ్మల్ని తనతో తీసుకువెళ్ళలేదా?" అడిగాకా కానీ అర్ధం కాలేదు నాకు, అది ఎంత అర్ధం లేని ప్రశ్నో?తీసుకెళ్ళి ఉంటే ఆశ్రమంలో ఎందుకు పెరుగుతాడు?.

నన్ను నేనే తిట్టుకుంటూ మాట మార్చడానికన్నట్టుగా. "అవునా? అమ్మ అంటే అంత ఇష్టం ఉండబట్టేనా.. అమ్మని మీరు అంత జాగ్రత్తగా చూసుకుంటున్నారు?" అడిగాను నవ్వుతూ. అతను నవ్వలేదు.

" అవును. అదొక్కటే కాదు! ఇకపైన నేనేలా ప్రవర్తించాలా ?అని కూడా" అన్నాడు సడన్ గా.

" ఇకపైనా? కొంపదీసి మా అమ్మని తీసుకెళ్ళిపోదామని ప్లాన్ వేస్తున్నారా ఏమిటి?" అన్నాను జోక్ చేస్తూ.

పక పకా నవ్వాడు.

" ఐ విష్" అన్నాడు.

"కానీ మీరు సేఫ్. అదృష్టవశాత్తూ నాకు మరో అవకాశం దొరికింది, లేకపోతే మీరన్నదే జరిగేదేమో!" అన్నాడు అతను కూడా నవ్వుతూ.

" అంటే?" అన్నాను అతను నవ్వుతుంటే ఆహ్లాదంగా ఉంది.

"మా నాన్నగారు రెండు వారాల క్రితం పోయారు. నేను వెళ్ళలేకపోయాను. ఏడాదికో నాలుగు జతలు, రెండు పూట్ల భోజనం పెట్టిన వ్యక్తిగా కంటే ఆయనతో నాకేమీ పెద్ద అనుబంధం లేదు కనక కొద్దిగా బాధ పడ్డాను తప్ప, వెళ్ళి చూడాలని కూడా అనిపించలేదు. బాధాకరమైన విషయమైనా అది నిజం.

అతను నన్నుకూడా తనతో తీసుకువెళ్ళచ్చు కదా అన్న బాధ కొన్నాళ్ళుండేది. మీ మెక్సికో అమ్మదగ్గర అది కుదరదు అనే ఆయన మాట నాకు బాగా గుర్తుంది. మీ మెక్సికో అమ్మ, స్పెయిన్ అమ్మ. ఇలాగే అనేవాడు రెండు మూడు సార్లు. అప్పుడు కోపంగా, బాధగా అనిపించినా ఇప్పుడు లేదు.

కానీ అతను వెళ్తూ వె ళ్తూ నాకో కానుక ఇచ్చి వెళ్ళాడు.

ముందే చెప్పాను కదా, ఆయన కూడా షిప్పులో పనిచేశారు, రెండు మూడు చోట్ల కుటుంబాలున్నాయని. మా అమ్మ, మరొకావిడ లేరు. కానీ తన మూడో భార్య అమాలియ అనే ఆవిడ మెక్సికోలో ఉన్నారు. ఆవిడే అతను చెప్పిన నన్ను తన దగ్గరుంచుకోవడానికి ఇష్టపడని నా మెక్సికో అమ్మ. ఇప్పుడావిడ సరిగ్గా నేనున్న పరిస్థితిలోనే ఉన్నారు.

ఆవిడకున్న ముగ్గురు కొడుకులు, కూతురు కూతురు, వీళ్ళెవరికీ కూడా ఆవిడని పట్టించుకునేంత తీరికా, దగ్గరుండి చూసుకోవలన్న కోరికా లేవుట. మీలో ఎవరైనా అవిడకి ఏదైనా సహాయం చెయ్యగలరా? అంటూ పోయేముంది మా నాన్న నాకు, అతనికున్న మరో నలుగురు పిల్లలకీ మెయిల్ రాశారు. నేనెక్కువ రోజులు బ్రతకను, నా తర్వాత అమాలియాకి ఎలా? అన్నదే నా బాధ అని ఆయన అన్నప్పుడు, కనీసం ఆయనకింత మాత్రపు బాధ్యత ఉందా అనుకున్నాను.

అతని మాటల్లో వ్యంగ్యం ఉందేమో అనుకున్నాను.

నేను సహాయం చేస్తాను ! అని సమాధానం పంపించాను..

‘ థాంక్ యూ అర్విన్’ ఈ ఒక్క వాక్యమే ఆయనదగ్గరినించి వచ్చిన చివరి మెయిల్..

ఇప్పుడు మనం మెక్సికోలో దిగగానే నేను వెతుక్కుంటూ వెళతాను మా మెక్సికో అమ్మ దగ్గరకి.”

" కానీ, ఆవిడ ఎప్పుడూ!?" అనబోతున్న నన్ను ఆపాడు అతను..

“అవును సర్, నన్నెప్పుడూ తన దగ్గర ఉంచుకోవడానికి ఆవిడ ఇష్టపడలేదు, ఆవిడ కున్న కారణాలు కొన్ని నేను ఊహించగలను. నలుగురు బిడ్డలున్న మహిళకి తన భర్త మరో బిడ్డను సాకాలంటే ఇష్టం ఉండకపోవడం చాలా సహజం. కానీ తల్లి ముఖం తెలియని బిడ్డకి, కలిసొచ్చే కాలానికి, నడవలేని తల్లిని చూసుకోవడం పెద్ద కష్టం కాదు కదా! అవును.. అమాలియా కీళ్ళ నొప్పులతో బాధపడుతూ వీల్ చెయిర్ కే పరిమితమయ్యారుట.“ అన్నాడు బాధగా.

" ఇంత మంచితనమా?" అన్నాను నేను అప్రయత్నంగా. కనిపెంచిన తల్లితండ్రులకి అన్నం పెట్టడం ఉపకారం అనుకునే పిల్లల మధ్య ఇలాంటివాళ్ళెలా సాధ్యం?

" నా స్వార్ధం లేదా సర్ ఇందులో? , మరో నాలుగు నెలల్లో నా జీవితంలోకి అడుగుపెట్టబోతున్న ఇంకా పుట్టని నా పిల్లలకి కాబోయే తల్లికి, అదే నా ప్రేయసికి ఓ పెద్ద తోడు అవసరం కదా. మరీ మూడోమనిషి లేని అనాధలం నేనూ, లిండా..” అన్నాడు అతను నెమ్మదిగా. మూసుకున్న అతని కళ్ళు, విప్పారిన పెదవులు.. పున్నమి చంద్రుని వెన్నెల్లా ముఖమంతా పరుచుకున్న అతని నవ్వు. సముద్రం కూడా మౌనంగా ఉంది.

●●●

Click here to share your comments on this story